# ఔదార్యం

కోఠీలో జనసంచారం తగ్గింది - బస్సులూ పలచబడ్డాయి.

ఆఫీస్ నుంచి బయటకు వచ్చేసరికే చీకటిపడి చాలా సేపయింది. ఇక బస్సుల కోసం ఎదురుచూస్తూ కూర్చుంటే ఇంకా ఆలస్యమై పోతుంది. రిక్షాలో వెళ్ళడం మేలనిపించింది.

బస్‌స్టాప్‌లో ఒక్కటే రిక్షా ఆగివుంది. నెమ్మదిగా అటువేపు బయల్దేరాను.

''ఎక్కడికెళ్ళాలి బాబూ?....'' త్రాగుతున్న బీడీని పారేసి చటుక్కున నిలబడ్డాడు రిక్షా అతను.

"చిక్కడపల్లి....''

''నాల్గు రూపాయలివ్వండి.''

''నాలుగా! మూడు రూపాయలిస్తాను'' పొరపాటున కూడా రిక్షాని బేరమాడకుండా ఎక్కకూడదు. వాళ్ళు అడిగినంత మనం బేరమాడకుండా ఇచ్చాముా అంటే అది ఎంత ఎక్కువైనా వాళ్ళకి తృప్తి వుండదు. మనల్ని వూరికే రిక్షాలో త్రిప్పినట్లు బాధపడిపోతారు. ఇంకొంతమందైతే బేరమాడి ఎక్కినా, గమ్యం చేరేసరికి ఎక్కువివ్వమని పేచీ పెడతారు. గట్టిగా అరిస్తే నలుగురు ఎక్కడ వింటారోననే భయంతోనైనా అవతలి వాళ్ళు అడిగినంతా ఇస్తారని వాళ్ళ ధీమా!

''మూడున్నరిప్పించండి....'' వాడు తగ్గినా నేను తగ్గకూడదనుకున్నాను.

"మూడు రూపాయలకన్నా పైసాగూడా ఇవ్వను. వస్తేరా- నీ ఇష్టం...."

"పోనీ, మూడుంబావలా ఇవ్వండి." ప్రతిమాలుతున్నట్లడిగాడు. అతను దిగివస్తున్న కొద్దీ నాలో బింకం పెరిగింది.

రెండడుగులు ముందుకు వేసాను రిక్షాని తీసుకొచ్చి ప్రక్క నాపాడు.

"ఎక్కండి...."

"మూడు రూపాయలే ఇచ్చేది." మరోసారి హెచ్చరించి, ధీమాగా, రిక్షా ఎక్కి కూర్చున్నాను.

'అప్'ని ఎక్కించి, చెమటలు కక్కుకుంటూ ఎంతో ప్రయాసతో నన్ను గమ్యాన్ని చేర్చాడు.

అంత చల్లటి వాతావరణంలోనూ చెమటలు కక్కుతున్న అతడిని చూసేసరికి జాలేసింది.

నాల్గు రూపాయలు తీసి అతనికిచ్చాను.

రూపాయి తిరిగి ఇవ్వబోయాడు.

"వద్దులే.... వుంచుకో...." అతన్ని గమనించనట్లే గుమ్మం వేపు కదిలాను.

కుదుర్చుకున్న బేరంకన్నా కాస్త ఎక్కువ ఇస్తే రిక్షావాళ్ళు ఖచ్చితంగా ఆనందపడతారు. మనల్ని పొగుడుతారు.

"వద్దండి.... ఈ రూపాయి మీరే తీసుకోండి. నా శ్రమకి మూడు రూపాయలే ఇస్తానని మీరన్నారు. నేనందుకు వప్పుకుని వచ్చాను. నా శ్రమకి తగ్గ ప్రతిఫలమే నాకు చాలు." ఆ రూపాయి నా చేతిలో పడేసి రిక్షాని ముందుకురికించాడు. నా ఔదార్యం మీద అతని ఆత్మాభిమానం గట్టి దెబ్బే తీసింది!

(ఈవారం వారపత్రిక)